క్లుప్తంగా

బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడిపై దాడి అమానుషం



నిరసన తెలుపుతున్న కుల సంఘాల నాయకులు

నందికొట్కూరు: బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కురుమూర్తిపై జరిగిన దాడి అమానుషమని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు నాగరాజు అన్నారు. దాడిని నిరసిస్తూ మంగళవారం పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ, బీసీ సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ నాలుగు నెలల క్రితం కురుమూర్తి ఇంటి వద్ద కుటుంబ సభ్యులను బెదిరించిన ఘటనపై పోలీసు స్టేషన్లో కేసు నమోదైందన్నారు. పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతోనే ప్రస్తుతం దాడి జరిగిందన్నారు. సమస్యలుంటే వ్యక్తిగతంగా లేదా చట్టం ద్వారా పరిష్కారం చేసుకోవాలన్నారు. అంతేకానీ ఇలా దాడులు చేయడం తగదన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, బీసీ సంఘాల నాయకులు ఇనాయతుల్లా, గోకారి, తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



మృతుని కుమారుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

జూపాడుబంగ్లా: మండలంలోని మండ్లెం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న రజక సంఘం గ్రామ నాయకులు వెంకటేశ్వర్లు అంత్యక్రియల నిమిత్తం అతని కుటుంబ సభ్యులకు రూ.5 వేల ఆర్థిక సాయం చేశారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

జూపాడుబంగ్లా: మండలంలోని తంగడంచ గ్రామంలో అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకున్న రైతు మస్తాన్ కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయాలని సీపీఎం నాయకుడు కర్ణ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన తంగడంచ గ్రామానికి చేరుకొని మృతుని భార్య, తల్లిదండ్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారని, కుటుంబ జీవనాధారమైన వ్యక్తి మృతితో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉందన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి ఆర్థిక సాయం అందించి ఆదుకోవటంతో కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

రబీలో 6,155 ఎకరాల్లో పంట సాగు

వెలుగోడు: మండలంలో రబీలో 6,155 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేశారని మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సాధారణ విస్తీర్ణానికి మించి వరి, జొన్న పంట సాగు చేశారన్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ వెలుగోడు రిజర్వాయర్ నీటి లభ్యత ఉన్నందున బోరుబావులు రీచార్జ్ కావడంతో రైతులు బీడు భూములను పంట పొలాలుగా ఉపయోగించుకుంటున్నారన్నారు.

సచివాలయాల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ సూర్యనారాయణ

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు, జూటూరు గ్రామ సచివాలయాలను డీఎల్‌డీఓ సూర్యనారాయణ మంగళవారం తనిఖీ చేశారు. ఆధార్ సెంటర్లలో శిశు ఆధార్‌సేవల గురించి ఆరా తీశారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై సిబ్బందితో మాట్లాడారు. సిబ్బంది హాజరుపట్టీలను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది సమయ వేళలు పాటించాలని చెప్పారు. వివిధ పనుల కోసం వచ్చే ప్రజల పట్ల గౌరవంగా మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, సమస్య జటిలమైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీడీఓ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

కుమారస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమార స్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

చిరుద్యోగులపై కక్ష్య సాధింపు తగదు

● వైఎస్సార్‌సీపీ నాయకులు



వివరాలు వెల్లడిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు పోచా జగదీశ్వరరెడ్డి

జూపాడుబంగ్లా: చిరుద్యోగులైన ఫీల్డ్‌అసిస్టెంట్లు, బుక్‌కీపర్లను రాజకీయ దురుద్దేశంతో తొలగించాలని చూస్తే ఉపేక్షించేదిలేదని జెడ్పీటీసీ సభ్యుడు పోచా జగదీశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ కోనిక తిరుమలేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, సర్పంచ్ కేశవరెడ్డిగారి నాగార్జునరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు తోకల కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం వారు ఎంపీడీఓ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. కూటమి నాయకులు వీఓఏలు, ఫీల్డ్‌అసిస్టెంట్లు, డీలర్లపై కక్ష్యసాధింపు ధోరణి అవలంభించటం తగదన్నారు. 80బన్నూరు గ్రామంలో పంచాయతీ తీర్మానం లేకుండా అధికారులు, నాయకులు కుమ్మక్కై ఫీల్డ్ అసిస్టెంటును నియమించారన్నారు. తాటిపాడు గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ లింగన్న వార్షిక సంవత్సరం ముగియకుండానే ఉపాధి పనులు కల్పించలేదంటూ సస్పెండ్ చేయడం సమంజసంగా లేదన్నారు. తాటిపాడు బుక్‌కీపర్ దళిత మహిళ ఉషారాణి ఎలాంటి అవినీతి, అక్రమాలకు పాల్పడకపోయినా ఆమెను తొలగించాలని దొంగసంతకాలతో అధికారులకు ఫిర్యాదు చేయడం కూటమినాయకుల స్వార్థ రాజకీయాలకు నిదర్శనమన్నారు. పారుమంచాల ఇసుకవాగు వద్ద రూ.5 కోట్లతో వంతెన నిర్మాణం కోసం భూమిపూజచేసి ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఉద్దేశపూర్వకంగా కూటమినేతలు కూల్చివేయటం హేయమైన చర్యగా పేర్కొన్నారు. అనంతరం 80బన్నూరు ఫీల్డ్ అసిస్టెంటును పంచాయతీ తీర్మానం లేకుండా ఏ ప్రాతిపదికన నియమించారో వివరాలు వెల్లడించాలని ఆర్టీఐ యాక్టు ప్రకారం ఎంపీడీఓ గోపికృష్ణకు దరఖాస్తును అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు 80బన్నూరు నానిరెడ్డి(మద్దిలేటిరెడ్డి), కోసిక తరుణ్‌కుమార్ రెడ్డి, పారుమంచాల మాజీ సర్పంచ్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నెహ్రూనగర్‌లో ఇరువర్గాల ఘర్షణ

● ఒకరికి రక్తగాయాలు



నెహ్రూనగర్‌లో నడిరోడ్డుపై ఘర్షణకు పాల్పడిన ఇరువర్గాలు

పగిడ్యాల: జరిగిన చిన్న పొరపాటుకు సర్దిచెప్పుకుంటే పోయే దానికి బేషజాలకు పోయి ఫ్యాక్షన్ సినిమాను తలపించేలా నడిరోడ్డుపై ఇరువర్గాలు ఘర్షణ పడిన ఘటన మంగళవారం నెహ్రూనగర్‌లో చోటుచేసుకుంది. ఎస్సీ కాలనీకి చెందిన నరసింహుడు కుమారుడు సుదర్శన్ సోమవారం ఉదయం ఎద్దుల బండిపై పలుగోరు వేసుకుని పొలానికి బయలుదేరాడు. ఈ క్రమంలో ఇదే కాలనీకి చెందిన చంద్రుడు బైక్‌కు పలుగోరు తగిలింది. సాయంత్రం రచ్చకట్ట వద్దకు వచ్చిన సుదర్శన్‌ను చంద్రుడు సమీపించి బైక్‌కు పలుగోరు తగిలించి వెళ్లడం వల్ల డ్యామేజ్ అయిందని నిలదీశాడు. దీంతో సుదర్శన్ ×తగిలించాను నీ ఇష్టమున్న చోట చెప్పుకో₹ అంటూ రెచ్చగొట్టాడు. ఈక్రమంలో ఇద్దరి మధ్య మాటమాట పెరిగి తగువులాడుకోగా స్థానికులు సర్ది చెప్పి పంపివేశారు. ఇది జీర్ణించుకోలేని సుదర్శన్ నందికొట్కూరు నుంచి బంధువులను రప్పించుకుని ఉదయం చంద్రుని కుమారుడు కిరణ్‌ను తరుముకుంటూ వెంటపడి సుంకులమ్మ గుడి వద్ద దాడి చేశారు. అయితే దాడికి పాల్పడిన వినోద్ తలకే రక్తగాయమైంది. అరగంట పాటు కాలనీలో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ఇరువర్గాలు పిడిగుద్దులతో ఒకరినొకరు తలపడడం చూసిన స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం తెలుసుకున్న ముచ్చుమర్రి పోలీసులు హుటాహుటిన నెహ్రూనగర్‌కు చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టి అనుమానితులను స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి ఘర్షణకు దారితీసిన పరిణామాలపై విచారణ చేపట్టారు.

కొత్త వర్షన్‌తో తప్పని తిప్పలు



యాప్ పనిచేయకపోవడంతో చెట్ల కింద సేదతీరుతున్న ఉపాధి కూలీలు

● ఉపాధి కోల్పోతున్న కూలీలు

కొత్తపల్లి: ఉపాధి హామీ పథకం ద్వారా ఏటా పనులు కల్పించాల్సి ఉంది. అయితే గ్రామీణ ఈ పథకం ద్వారా పనులు నత్తనడకన సాగుతున్నాయి. వేలసంఖ్యలో కూలీలు హాజరు కావాల్సి ఉండగా వందల సంఖ్యను కూడా దాటకపోవడం గమనార్హం. ఈ పథకం రెండు రోజుల నుంచి ఓ కొత్త వర్షన్ వచ్చింది. సోమ, మంగళవారాల్లో ఈ కొత్తరకం వర్షన్‌తో అటు ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇటు కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్ఎంఎంఎస్ యాప్ సరిగ్గా పనిచేయకపోవడంతో కూలీలు గంటల తరబడి పనిప్రదేశంలో వేచి చూడాల్సి వచ్చింది. అందులోనూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో యాప్ పనిచేసి మొదటి ఫొటో వచ్చే వరకు చెట్ల కింద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. అసలు చేసిన పనికి వేతనం వస్తుందా? లేదా ? అనే సందిగ్ధంలో వేతనదారులు ఉన్నారు. కొంతమంది కూలీలు తమ పేర్లు ఆన్‌లైన్లో రాలేదని ఇళ్లకు వెనుతిరిగి వెళ్లారు. ఉన్నతాధికారులు సమస్యను పరిష్కరించాలని వేతనదారులకు, ఫీల్డ్ అసిస్టెంట్లు కోరుతున్నారు.

పశు గ్రాసం ఉత్పత్తి చేపట్టాలి



లేగ దూడకు నట్టల నివారణ మందు తాపుతున్న పశువైద్యాధికారి భాస్కర్

పాములపాడు: పాడి రైతులు పశు గ్రాసం ఉత్పత్తిని చేపట్టాలని పశువైద్యాధికారి భాస్కర్ సూచించారు. మంగళవారం మండలంలోని యర్రగూడూరు గ్రామంలో పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి లేగ దూడలే రేపటి పాడి పశువులన్నారు. క్రమం తప్పకుండా నట్టల నివారణ మందులు తాపించాలని సూచించారు. 6 ఎద్దులు, 10 గేదెలు, 12 దూడలు, 600 గొర్రెలు, మేకలు, 60 కోళ్లకు నట్టల నివారణ మందులు వేశారు. నాలుగింటికి చూడీ పరీక్షలు చేశారు.

– బండిఆత్మకూరు: మండల పరిధిలోని పెద్ద దేవలాపురం, ఏ.కోడూరు గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. పశువులకు చూడీ పరీక్షలు, గొడ్డు మోతు పశువులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. పశువులకు బాహ్య పరాన్న జీవులు సోకకుండా మందులు స్ప్రే చేశారు. గొర్రెలకు బొబ్బ రోగం రాకుండా, కోళ్లకు కొక్కెర తెగులు రాకుండా టీకాలు వేశారు.

– మహానంది: మండల పరిధిలోని తమ్మడపల్లెలో మంగళవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. 42 గేదెలు, 25 దూడలు, గొర్రెలతో పాటు మేకలకు నట్టల నివారణ(డీ వార్మింగ్)మందులు తాపించారు. కార్యక్రమంలో పశు సంవర్థకశాఖ లైవ్ స్టాక్ ఆఫీసర్ సులోచన తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలెండర్ల చోరీ

నందికొట్కూరు: తాళం వేసి ఉన్న ఇంట్లోకి దుండగులు చొరబడి మూడు గ్యాస్ సిలిండర్లను చోరీ చేసిన ఘటన స్థానిక మారుతీనగర్‌లో ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో చోటుచేసుకుంది. హోటల్ నడుపుకుంటూ జీవనం సాగించే హసీనా మూడు రోజుల క్రితం హైదరాబాద్‌లోని బంధువుల వద్దకు పిల్లలను తీసుకొని వెళ్లింది. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి రెండు నిండు సిలిండర్లు, ఒక ఖాళీ సిలండర్‌ను ఎత్తుకెళ్లారు. తలుపులు తెరిచి ఉండటం గమనించిన ఇంటి పక్కనున్న వారు ఫోన్ ద్వారా మహిళకు సమాచారం అందించడంతో ఆమె హుటాహుటిన నందికొట్కూర్‌కు చేరుకుని చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కకుక్కల దాడిలో దూడకు తీవ్రగాయాలు

పాములపాడు: మండల కేంద్రంలోని రైతు పక్కిరయ్యకు చెందిన దూడపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. సోమవారం రాత్రి నిద్రిస్తున్న దూడపై కుక్కలు దాడి చేసి ఇష్టానుసారంగా పీక్కు తిన్నాయి. తీవ్ర గాయాలతో మృత్యువుతో పోరాడుతున్న లేగదూడను ఉదయం పశు వైద్య సిబ్బంది పరిశీలించి వైద్య సేవలు అందించారు. కాగా తరచూ కుక్కలు జీవాలను చంపేస్తున్నాయని, వాటిని పట్టుకుని వేరే చోటుకు తరలించాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

29న వ్యవసాయ కళాశాలలో స్పోర్ట్స్ మీట్

మహానంది: మహానంది సమీపంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాల ఆవరణలో ఈనెల 29న స్పోర్ట్స్ మీట నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వీర జయలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్, గేమ్స్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం వీసీ డాక్టర్ శారద జయలక్ష్మి పాల్గొంటారన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

పగిడ్యాల: ముచ్చుమర్రి పోలీసుస్టేషన్ పరిధిలోని పడమర ప్రాతకోట గ్రామంలో అక్రమంగా విక్రయిస్తున్న 22 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం విశ్వసనీయ సమాచారం మేరకు ప్రాతకోట గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపుపై దాడులు నిర్వహించారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న దర్బార్ నుంచి 22 క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేశామన్నారు.

– కొత్తపల్లి: మండలంలోని జడ్డువారిపల్లెలో కొండం పక్కిరాజు అనే వ్యక్తి తన ఇంటి సమీపంలో మద్యం విక్రయిస్తుండగా తమకు అంది, సమాచారం మేరకు సోదాలు నిర్వహించినట్లు ఏఎస్ఐ వెంకటరామ నాయక్ తెలిపారు. అతని వద్ద నుంచి 7 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

మద్యం విక్రయిస్తే కేసులు నమోదు

నందికొట్కూరు: బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ శాఖ ఎస్ఐ జప్రుల్లా హెచ్చరించారు. మండల పరిధిలోని శాతనకోట గ్రామంలో మంగళవారం మద్యం బాటిళ్లు అమ్ముతున్న శంకర్ నాయక్‌ను అరెస్టు చేసి 10 మద్యం బాటిల్స్ చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మద్యం బాటిళ్లు అమ్మిన చట్ట పరంగా నేరమన్నారు. మద్యం బాటిల్స్ అమ్ముతున్న వ్యక్తిని కోర్టులో హాజరుపరచగా 15 రోజులు రిమాండ్ ఆదేశించడం జరిగిందన్నారు. 10 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. హెడ్ కానిస్టేబుళ్లు శంకర్ నాయక్, కుమారి, కానిస్టేబుల్స్ శివన్న, సుధీర్‌బాబు, మధుసూదన్, ప్రసాద్ ఉన్నారు.

ఘనంగా ఐలమ్మ విగ్రహ ప్రతిష్ట వార్షికోత్సవం



ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రజక చైతన్య సంఘం నాయకులు

జూపాడుబంగ్లా: మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన ఐలమ్మ విగ్రహ ప్రతిష్ట వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రజకులకు ధోబీ ఘాట్లు నిర్మించి ఆదుకోవాలని రజక సంఘం రాష్ట్ర మాజీ నాయకుడు బస్తిపాటి మౌలాలి డిమాండ్ చేశారు. అనంతరం రజకసంఘం మండల అధ్యక్షుడిగా రామాంజనేయులు, ఉపాధ్యక్షులుగా నాగేశ్వర రావు, నడిపి ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా బండ్ల రవికుమార్, సహాయ కార్యదర్శి నాగన్న, మద్దిలేటి, ప్రచార కార్యదర్శిగా నాగభూషణం, కోశాధికారిగా శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో శ్రీశైలం రజక సత్రం వైస్ ప్రెసిడెంట్ నాగభూషణం, సర్పంచ్ మొట్టి బాలయ్య, సైపుద్దీన్, మాజీ కోఆప్సన్ గోరెసాహెబ్, నాగరత్నం, అంబేడ్కర్ యువ జనసంఘం నాయకుడు ఎర్రన్న, జిల్లా రజక వృత్తి దారుల సంఘం కన్వీనర్ చందా వెంకటేశ్వర్లు, రామకృష్ణ, వివిధ గ్రామాల రజకులు పాల్గొన్నారు. వివిధ గ్రామాల రజకులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరురూరల్: పారా లీగల్ వలంటీర్ల(పీఎల్‌వీ) నియామకం కోసం ఫిబ్రవరి 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. కనీస విద్యార్హత పదో తరగతి. చట్టాలు, న్యాయ వ్యవహారాలపై అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుంది. రిటైర్డ్ ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సామాజిక కార్యకర్తలు, న్యాయ విద్యార్థులు, రాజకీయ పార్టీలకు చెందని యువకులు అర్హులు. దరఖాస్తులు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శికి కానీ, మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులకు గానీ పంపించవచ్చని ప్రకటనలో పేర్కొంది.

శిశు ఆధార్ నమోదును వేగవంతం చేయించండి



ఏసీడీపీఓతో మాట్లాడుతున్న ఎంపీడీఓ గోపికృష్ణ

జూపాడబంగ్లా: ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శిశు ఆధార్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయించాలని ఎంపీడీఓ గోపికృష్ణ ఏసీడీపీఓ మంగవల్లికి సూచించారు. మరో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయించి ఆధార్ నమోదు ప్రక్రియ వేగవంతం చేయించాలని ఐసీడీఎస్ ఏసీడీపీఓ మంగవల్లి ఎంపీడీఓను కోరారు. మండలంలోని ఆధార్ కేంద్రం పరికరాలకు త్వరలో మరమ్మత్తులు నిర్వహింపజేసి అందుబాటులోకి వచ్చేలా చేస్తామన్నారు. ప్రస్తుతం ఉన్న ఒక్క అంగన్‌వాడీ కేంద్రంలో రోజుకు కేవలం 15 నుంచి 20మంది మాత్రమే శిశు ఆధార్‌నమోదు చేయించుకొంటున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. మండలం వ్యాప్తంగా సుమారు 500 శిశు ఆధార్‌నమోదు చేయాల్సి ఉండగా ఇంకా 393 పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ వర్కర్లు చిన్నారుల తల్లులకు అవగాహన కల్పించి సత్వరమే ఆధార్‌నమోదు చేయించుకొనేలా చేయాలన్నారు. పుట్టినతేదీ సర్టిఫికేట్ పొందిన వారు వెంటనే శిశు ఆధార్ నమోదు చేయించుకొనేలా చేయాలని ఎంపీడీఓ తెలిపారు. అవసరమైతే డీఎల్‌డీఓ తో మాట్లాడి పోస్టల్ ఆధార్‌సెంటర్ ఏర్పాటుచేయిస్తామని తెలిపారు. ప్రస్తుతం ఆధార్ నమోదు కేంద్రాలు అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్నందున సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ వర్కర్లు బాధ్యతగా తీసుకొని శిశు ఆధార్ నమోదు వేగవంతం అయ్యేలా చేయాలన్నారు. ఏసీడీపీఓ వెంట సూపర్‌వైజర్ కుమారి ఉన్నారు.

పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తాం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఆసియామారూఫ్

ఆత్మకూరు: పట్టణాన్ని మరింతగా అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్ తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిలర్ల సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఇటీవల ఆర్టీసీ బస్టాండు ఎదుట ఐ లవ్ ఆత్మకూరు బోర్డు ఏర్పాటు చేశామని, విద్యుత్ స్తంభాలకు వివిధ రంగులతో విద్యుత్ బల్బులను వేశామని తెలిపారు. పలు కాలనీల్లో ఇప్పటికే సీసీ రోడ్లు వేయించామన్నారు. ఇంకా పలు కాలనీల్లో సీసీ రోడ్లు వేసేందుకు సభ్యుల తీర్మానం కోరుతున్నట్లు చెప్పారు. వచ్చేది వేసవికాలం కాబట్టి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడా పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా అన్ని బోర్లకు మరమ్మతులు చేపడతామన్నారు. రక్షిత మంచినీటి ట్యాంకర్లను శుభ్రం చేసి, 24 గంటలు ట్యాంకర్లకు మంచినీరు అందేలా మున్సిపల్ సిబ్బందిని అప్రమత్తం చేస్తామన్నారు. అనంతరం సమావేశంలో ఎనిమిది తీర్మాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

కూలీలకు పనులు కల్పించకపోతే చర్యలు



సిబ్బందికి సూచనలిస్తున్న ఏపీడీ అన్వరా బేగం

పగిడ్యాల: పని కోరిన ప్రతి కుటుంబానికి పనులు కల్పించాలని లేదంటే చర్యలు తప్పవని డ్వామా ఏపీడీ అన్వరాబేగం హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 50 మంది సభ్యులతో కూడిన శ్రమ శక్తి సంఘాల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ప్రతి కుటుంబానికి వంద రోజుల పనులు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. లేబర్ రిపోర్టింగ్, పశుగ్రాసం పెంపకం, ఇంకుడు గుంతల నిర్మాణం, గోకులం షెడ్స్ నిర్మాణాల పురోగతి తదితర అంశాలపై సమీక్షించారు. ఫీల్డ్ అసిస్టెంట్స్, టెక్నికల్ అసిస్టెంట్స్ పనితీరు సరిగా లేకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎంపీడీఓ సుమిత్రమ్మ, ఏపీఓ మద్దిలేటి, ఈసీ అశోక్ పాల్గొన్నారు.

మహానందిలో కొనసాగుతున్న భక్తుల రద్దీ



మహానందిలో భక్తులరద్దీ

మహానంది: మహానందిలో భక్తులరద్దీ కొనసాగుతుంది. పలు ప్రాంతాలకు నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలి వచ్చారు. కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం, మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు భక్తుల సందడి కనిపించింది.

మహానందీశుడికి ఏకాంతసేవ పూజలు

మహానందీశుడి దంపతులకు మంగళవారం రాత్రి ఏకాంతసేవ పూజలు వైభవంగా జరిగాయి. వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, శాంతారాంభట్, హనుమంతు శర్మలు స్థానిక యాగశాలలో పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. పలు ప్రాంతాల భక్తులు స్వామి, అమ్మవారి ఏకాంత సేవ పూజలు తిలకించారు. పూజల అనంతరం భక్తులకు స్వామి, అమ్మవారి ప్రసాదాలు పంపిణీ చేశారు.

5న తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

ఆత్మకూరు: పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ ఫిబ్రవరి 5 న తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా నాయకులు ఎం.రమేష్‌బాబు, తాలూకా కార్యదర్శి ప్రతాప్ తెలిపారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో వారు ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్లు లేని నిరుపేదలు చాలా మంది ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాల విషయంలో నిర్లక్ష్యం చూపడం తగదన్నారు. తక్షణమే పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలను పేదలకు కేటాయించాలన్నారు. పట్టణంలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూములు భూకబ్జాదారుల చేతుల్లో ఉన్నాయని, వాటిని స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలన్నారు. పాములపాడు, కొత్తపల్లి, వెలుగోడు తదితర మండలాల్లో నిరుపేదలను గుర్తించి ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మహిళా సమైక్య నాయకులు స్వాతి, ముర్తుజాబీ, సీపీఐ నాయకులు యేసేపు, ఏఐటీయూసీ నాయకులు లల్లూ, ఓబులేష్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

● ఏడీఏ విజయశేఖర్



మిడుతూరు: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ విజయశేఖర్

మిడుతూరు: రైతులు వాతావరణానికి అనుగుణంగా మార్పు చేసుకొని పంటల సాగు చేపట్టడంతోపాటు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని నందికొట్కూరు ఏడీఏ విజయశేఖర్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని మాసపేట, కడుమూరు, చింతలపల్లి, దేవనూరు, చౌట్కూరు, గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ పంటల సాగులో మెలకువలు, సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అనంతరం ఏపీ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ కర్నూలు వారు ఇచ్చిన సర్టిఫైడ్ శనగ విత్తనాల పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పీరునాయక్, నంద్యాల వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి హేమలత, ఏఈఓలు అశోక్, మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు.

■ కొత్తపల్లి: మండల పరిధిలోని ఎదురుపాడు గ్రామ శివారులోని కంది పొలాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిచారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి కె.మహేష్ మాట్లాడుతూ ప్రభుత్వ మద్దతు ధర రూ.7,550తో కంది దిగుబడులు విక్రయించుకోవాలనుకునే రైతులు రైతు సేవా కేంద్రాల్లో పేరు నమోదు చేయించుకోవాలన్నారు. దుద్యాల పశువైద్యాధికారి అశోక్‌కుమార్ మాట్లాడుతూ పశువుల ఆరోగ్యం కోసం, మేలు రకాల దూడల కోసం ఈనెల 20 నుంచి 30వ తేదీ వరకు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీటితోపాటు గొర్రెలు, మేకలు, కోళ్లల్లో వచ్చే బొబ్బ రోగం, కొక్కెర తెగులుకు టీకాలు సంబంధిత పశు వైద్యశాలనందు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన వారు సద్వినియోగంగ చేసుకోవాలని సూచించారు.

■ జూపాడుబంగ్లా: కందుల విక్రయానికి రైతుసేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకోవాలని ఏఓ కృష్ణారెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని తర్తూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో పంటలు సాగుచేసిన రైతులు వెంటనే రైతుసేవా కేంద్రాల్లో ఈపంట నమోదు చేయించుకొని ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. సాగుచేసిన పంటలకు ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవటం వల్ల అతివృష్టి, అనావృష్టి సమయాల్లో నష్టపరిహారం పొందే అవకాశం ఉంటుందన్నారు.

■ నందికొట్కూరు: మండల పరిధిలోని బిజినవేముల గ్రామ పొలిమేరలో రైతులకు పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. బిజినవేముల గ్రామ సమీపంలోని శనగ, మినుము పంటల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. డివిజన్, మండల స్థాయి వ్యవసాయ అధికారులు విజయశేఖర్, షేక్షావలి, సిబ్బంది రబీ సీజన్‌లో వేసిన పంటలకు బీమా కట్టించుకోవాలని రైతులకు సూచించారు.

■ పాములపాడు: మినుము పైరులో పచ్చ అట్టలు వాడి దోమ ఉధృతిని తగ్గించుకోవద్దని మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని రుద్రవరం, కంబాలపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పైర్లను పరిశీలించారు. పంట మార్పిడి చేయాలని రైతులకు సూచించారు. భూమిలో పుట్టే రోగాలు ఎక్కువ అవుతున్నాయన్నారు. వాటిని అధిగమించడానికి సేంద్రీయ ఎరువులు, పచ్చరొట్ట ఎరువులు వాడాలని, దీంతో భూమి సారవంతం అవుతుందని వివరించారు.

పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



రైతులకు సూచనలిస్తున్న మండల వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి

ఆత్మకూరు: కంది, మినుము పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని ఆత్మకూరు, బాపనంతపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంది పంట విత్తే ముందు విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. భూసార పరీక్ష చేయించుకుని ఉదజని సూచిక ఆధారంగా పంటల ఎంపిక చేసుకోవాలన్నారు. పంట మార్పిడి ఉపయోగాలను రైతులకు తెలియజేశారు. పంటల నమోదు, ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. సేంద్రియ, పచ్చిరొట్ట ఎరువుల వాడడం వల్ల భూసారం పెంచవచ్చన్నారు. కార్యక్రమంలో పట్టు పరిశ్రమ అధికారిణి అరుణ, వ్యవసాయ విస్తరణ అధికారి రాజశేఖర్ పాల్గొన్నారు.